సాక్షి
విశాఖపట్నం
మంగళవారం : 23 : మే : 2023



బాక్సింగ్ చాంప్ విశాఖ

6వ యూత్ మెన్ అంతర జిల్లాల బాక్సింగ్ పోటీల్లో టీమ్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. 8లో



విశాఖతో వీడని బంధం

నటుడు శరత్‌బాబుకు విశాఖతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన మృతితో అభిమానులు శోకసంద్రంతో మునిగిపోయారు. 8లో



విశాఖలో 'నేను స్టూడెంట్ సర్'

నేను స్టూడెంట్ సర్ చిత్రం అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో బెల్లంకొండ గణేష్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుందర్

బీచ్‌రోడ్డు : సిరిపురంలోని వీఎంఆర్డీఏ సముదాయంలో సోమవారం జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయాన్ని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ వి.సుందర్ ప్రారంభించారు. అనంతరం జేటీసీ సుందర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పరిధిలోని రవాణాశాఖ దైనందిన కార్యకలాపాల సమగ్ర పర్యవేక్షణకు జోనల్ స్థాయిలో ఈ కార్యాలయం ఏర్పాటైందని చెప్పారు. రోడ్డు భద్రత, ఆదాయం పెంపు ఎలా, డ్రైవింగ్ స్కూళ్లు, డ్రైవింగ్ ట్రాక్‌ల పనితీరు, ఫిట్‌నెస్ ఆటోమేషన్ వంటి వాటిపై తరచూ పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యాలయంలో ఒక పరిపాలన అధికారి, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండరు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీసీ రాజారత్నం, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.కనకరాజు అందజేశారు.

25న నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు

విశాఖ విద్య : పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25న నియోజకవర్గ స్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఇన్‌చార్జి డీఈవో జి.లక్ష్మణరావు సూచించారు. ఎంఈవోలు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారులతో సోమవారం డీఈవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 25న జిల్లాలోని అన్ని నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లా స్థాయి, 31న రాష్ట్ర స్థాయి వేడుకలు జరుగుతాయన్నారు. జగనన్న ఆణిముత్యాలకు టెన్త్, ఇంటర్మీడియెట్ కలిపి నియోజకవర్గ స్థాయిలో 32 మంది, జిల్లా స్థాయిలో 39 మంది, రాష్ట్ర స్థాయికి ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా వృత్తి విద్య శాఖాధికారి రాయల సత్యనారాయణ, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఏర్పాట్లపై సమీక్ష

విశాఖ విద్య: ఈ నెల 24 నుంచి జరగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల విజయవంతానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్లో సమీక్షించారు. అడ్వాన్స్‌డ్ పరీక్షల ఏర్పాట్లపై ఆర్ఐవో ఉమారాణి వివరించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొదటి సంవత్సరం 44,562 మంది, రెండో సంవత్సరం 18,719 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. మొత్తం 100 పరీక్షా కేంద్రాలు కేటాయించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున అన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తగనన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో డీవీఈవో ఆర్. సత్యనారాయణ వైద్య ఆరోగ్య, రవాణా, పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

పనికో రేటు!

- డ్రైవింగ్ లైసెన్స్‌కు రూ.5 వేలు
- వాహనం ఫిట్‌నెస్‌కు అదనంగా రూ.2-3 వేలు
- చలానా సొమ్ముకంటే అధికంగా వసూలు
- వేలిముద్ర వేస్తే చాలు.. పనులన్నీ వాళ్లే చేయిస్తారు..
- రవాణా శాఖలో దళారుల హవా





సాక్షి, విశాఖపట్నం : రవాణా శాఖలో సాంకేతికత అందుబాటులోకి వచ్చినా దళారుల హవా ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆ శాఖలో కొంతమంది అధికారులు/సిబ్బందితో వీరి అనుబంధానికి బ్రేకులు పడడం లేదు. రవాణా శాఖలో ఏజెంట్లు, దళారుల దందా మితిమీరడంతో ప్రభుత్వం ఆన్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. దీంతో వీరి దందా చాలావరకు అడ్డుకట్ట పడింది. అనంతరం వీరిలో చాలామంది కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీల) పేరిట అనుమతులు తెచ్చుకొని సొంతంగా షాపులను ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి వారు ఈ శాఖలో వివిధ పనులు చేయించే బాధ్యతను తీసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, లైసెన్స్‌ల రెన్యూవల్, డూప్లికేట్ లైసెన్స్‌ల జారీ, చిరునామా మార్పు, వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ వంటివి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వంటివి చేస్తున్నారు. వీటిపై అవగాహన లేని వారికి, అంత తీరిక లేని వారికి తామే ఇవన్నీ చేయించి ఇచ్చేందుకు ప్యాకేజీ కుదుర్చుకుంటున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి ఆ పని కానిస్తున్నారు.

మూడు, నాలుగు రెట్లు అదనంగా వసూలు


ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో పనికి (సేవకు) ఒక్కో విధంగా చలానా రుసుమును నిర్దేశించింది. ఆ ప్రకారం చలానా మొత్తాన్ని చెల్లించి అవసరమైన పత్రాలను సమర్పిస్తే సరిపోతుంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పత్రాలు లేకపోయినా, సమర్పించకపోయినా తిరస్కరణకు గురవుతుంది. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది సీఎస్‌సీల నిర్వాహకులు అధిక మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారంలో కొందరు రవాణా శాఖ అధికారులు, సిబ్బంది వీరికి సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్‌కు రూ.1260, దీని రెన్యూవల్‌కు రూ.660, లేటు ఫీజు నెలకు రూ.100, చిరునామా మార్పునకు రూ.660, డూప్లికేట్ డ్రైవింగ్ లైసెన్స్‌కు రూ.560 చొప్పున ప్రభుత్వానికి చలానా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. **ఉదాహరణకు రెండు,** నాలుగు చక్రాల వాహన **డ్రైవింగ్ లైసెన్స్ పొందా**లంటే విధిగా గంభీరంలోని రవాణాశాఖ టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌లో నిర్వహించే వాహన పరీక్షలో పాస్ అవ్వాలి. కానీ అలాంటి అవసరం లేకుండా కేవలం ఒకసారి అక్కడకు వెళ్లి వేలి ముద్ర వేసి రూ.5 వేలు (4 చక్రాల వాహన డ్రైవింగ్ లైసెన్స్‌కు) చెల్లిస్తే ఇంటికే నేరుగా డ్రైవింగ్ లైసెన్స్ వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలాగే మరికొన్ని సేవలకు కూడా ఒక్కో ధర నిర్ణయించి నిర్ణీత రుసుము కంటే మూడు, నాలుగు రెట్లు అదనంగా వసూలు చేసి పనులు జరిపిస్తున్నారు.

సీఎస్‌సీ నిర్వాహకులను ఆశ్రయిస్తూ...

లైసెన్స్‌లు, రెన్యూవల్స్, ఫిట్‌నెస్‌ల్లో ఏవో లోపాలున్న వారు, మరేవో సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురైన వారు రవాణా శాఖ సిబ్బందిని కాకుండా నేరుగా ఈ సీఎస్‌సీ నిర్వాహకులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు సీఎస్‌సీల సంబంధీకులు విశాఖలోని రవాణా శాఖ కార్యాలయం పరిసరాల్లో తిరుగుతుంటారు. ఇలాంటి వారు రవాణా శాఖలో జరగని పనులు చేయిస్తారన్న పేరు తెచ్చుకున్నారు. నిర్దేశిత చలానా సొమ్ముకంటే అధిక మొత్తం వసూలు చేసిన సొమ్ములో రవాణాశాఖ సిబ్బంది చేయి తడిపి లొసుగులను పక్కదారి పట్టిస్తారన్న ఆరోపణలున్నాయి.

జనాభా వృద్ధిలో విశాఖ టాప్

- 12 ఏళ్లలో జిల్లాలో 45 శాతం జనాభా వృద్ధి నమోదు
- 2023 చివరి నాటికి 28.56 లక్షలకు చేరుకునే అవకాశం?
- జీవీఎంసీ పరిధిలో 22.4 శాతం పెరుగుదల



సాక్షి, విశాఖపట్నం: సువిశాల సాగరతీరం.. ఎటు చూసినా కనువిందు చేసే సోయగాల్ని సొంతం చేసుకున్న అందమైన విశాఖ నగరంలో జనాభా క్రమంగా పెరుగుతోంది. స్థిరపడిన వలస జీవులతోపాటు విస్తరిస్తున్న నగరంలో జనాభా వృద్ధి రేటు కూడా అదే స్థాయిలో ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత కూడా జనాభా పెరుగుదలలో విశాఖపట్నం అగ్రస్థానంలో ఉండటం విశేషం. 2011 నుంచి 2023 డిసెంబర్ నాటికి జనాభా వృద్ధిలో విశాఖ జిల్లా 45.76 శాతంతో రాష్ట్రంలో అగ్రస్థానంలోను.. 33.41 శాతం వృద్ధితో అనకాపల్లి జిల్లా 14వ స్థానంలో ఉంటుందని కేంద్ర గణాంకాల శాఖ అంచనా. జనాభా పెరుగుదలలో అల్లూరి సీతారామరాజు జిల్లా 32.33 శాతంతో 18వ స్థానంలో ఉండనుంది. అత్యధిక జనాభా పెరుగుదల ఉన్న కార్పొరేషన్‌గా జీవీఎంసీ మొదటి స్థానంలో నిలవనుంది. ఈ ఏడాది చివరి నాటికి జీవీఎంసీ పరిధిలో 26,96,364 మంది జనాభా నమోదు కానుందని గణాంకాలు చెబుతున్నాయి. 2011 నుంచి 2023 ఏడాది చివరి నాటికి జనాభా వృద్ధి ఎలా ఉంటుందనే వివరాల్ని ఓసారి పరిశీలిస్తే..

జిల్లా	విస్తీర్ణం (కి.మీ)	2011 జనాభా జనాభా	2023 అంచనా (చ.కిమీ)	జనసాంద్రత	వృద్ధి రేటు
విశాఖపట్నం	1,048	19,59,544	28,56,308	2725.48	45.76
అనకాపల్లి	4,292	17,26,998	23,04,020	536.81	33.41
అల్లూరి	12,251	9,53,960	12,62,388	103.04	32.33
జీవీఎంసీ	681.96	20,91,811	26,96,364	3,953.81	22.40

ఓపెన్ ఫలితాల్లో వెనుకంజ

- టెన్త్‌లో 35.41 శాతం, ఇంటర్‌లో 35.88 శాతం ఉత్తీర్ణత
- జూన్ 26 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో విశాఖ జిల్లా వెనుకబడింది. సోమవారం ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లా నుంచి పదో తరగతికి 836 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 296 మంది పాసయ్యారు. దీంతో 35.41 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదే విధంగా ఇంటర్మీడియెట్‌లో 931 మంది హాజరుకాగా, వీరిలో 334 మంది విద్యార్థులు పాసయ్యారు. తద్వారా 35.88 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో విశాఖ జిల్లాకు పదో తరగతి ఫలితాల్లో 15వ స్థానం, ఇంటర్మీడియెట్‌లో 18వ స్థానం దక్కింది. పదో తరగతి రెగ్యులర్ పరీక్షల్లో విశాఖ జిల్లా రాష్ట్ర సూచికలో మూడో స్థానం కైవసం చేసుకోగా, సార్వత్రిక పరీక్షల్లో మాత్రం బాగా వెనుకబడిపోవటం గమనార్హం. ఓపెన్ చదువులపై జిల్లా విద్యాశాఖాధికారులు అలసత్వంగా వ్యవహరించటం వల్లే ఫలితాలు ఆశాజనకంగా లేవని విమర్శలు ఉన్నాయి. ఫలితాలపై ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే రీ కౌంటింగ్‌కు రూ.200లు, రీ వెరిఫికేషన్‌కు రూ.1000లు ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు.

సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు 25 వరకు గడువు

జూన్ 26 నుంచి జులై 4 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఈ నెల 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. రూ.25ల అపరాధ రుసుముతో ఈ నెల 29 వరకు, రూ.50ల అపరాధ రుసుముతో ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది.

క్రీడలతో భవిత



విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్



బెలూన్లు ఎగురవేసి సమ్మర్ క్యాంప్స్‌ను ప్రారంభిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కలెక్టర్ మల్లి కార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- మేయర్ హరివెంకట కుమారి
- జీవీఎంసీ సమ్మర్ క్యాంప్‌ల ప్రారంభం

సీతంపేట: సమ్మర్ కోచింగ్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ హరి వెంకట కుమారి అన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిత బాగుంటుందన్నారు. స్వర్ణభారతి స్టేడియంలో సోమవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నగర పోలీస్ కమిషనర్ సీ.ఎం. త్రివిక్రమ్ వర్మ, డిప్యూటీ మేయర్, ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లతో కలిసి ఆమె వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలను 6 నుంచి 15 ఏళ్ల గల పిల్లలకు 15 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ అన్ని జోన్లలో, అన్ని వార్డుల్లో మొత్తం 333 శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశామని, ఎనిమిది వేల మంది పిల్లలు ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. 33 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు అల్పాహారంగా పాలు, గుడ్లు అందజేస్తారని, టీషర్టు కూడా ఇస్తారన్నారు. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచేందుకు వేసవి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు.

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ పిల్లల్లో శారీరక ఎదుగుదల, మానసిక బలం పెంపొందించేందుకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మూడేళ్ల తర్వాత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. దీనికి కారణమైన మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలను అభినందించారు. క్రీడల్లో ఆసక్తి చూపే పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనే చిన్నారులకు విశాఖ డెయిరీ ఫ్లేవర్డ్ మిల్క్ స్పాన్సర్ చేయడానికి ముందుకు వచ్చిందని, ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లకు వెల్ఫేర్ సెక్రటరీలు ఇన్‌చార్జిలుగా ఉంటారని, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ సీ.ఎం.త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఏదో ఒక క్రీడను ఎంచుకుని రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాలబాలికలు చేసిన మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు, తైక్వాండో, కరాటే, జూడో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, డీసీఆర్ ఎం.వి.డి.ఫణిరామ్, కార్యదర్శి పల్లి నల్లనయ్య, డీఈవో శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ వృద్ధిబాటలో భాగస్వాములు కావాలి

సీఎండీ అతుల్ భట్



కస్టమర్ మీట్ ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వృద్ధిబాటలో కస్టమర్లు భాగస్వాములు కావాలని తద్వారా స్టీల్‌ప్లాంట్ మార్కెట్ వాటాను పెంచుకోవడంలో సహకరించాలని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కోరారు. స్టీల్‌ప్లాంట్ గురజాడ కళాక్షేత్రంలో సోమవారం ఆలిండియా కస్టమర్ మీట్ -2023 నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కస్టమర్లతో చక్కటి అనుబంధం కలిగి ఉందన్నారు. కంపెనీ అదృష్టం కస్టమర్లతో ముడిపడి ఉందని భావిస్తామన్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఉత్పత్తిని పెంచడానికి సిద్ధంగా ఉన్నందున ఈ ఆర్థిక సంవత్సరం మరుపురాని ఏడాదిగా ఉండబోతుందన్నారు. డైరెక్టర్ (కమర్షియల్) డీకే మహంతి మాట్లాడుతూ దీర్ఘకాలంలో తమ విలువైన కస్టమర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు స్టీల్‌ప్లాంట్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. 'సరైన సమయంలో, సరైన సమయం వద్ద, సరైన ధరకు అన్న' అనే నినాదంతో కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు స్టీల్‌ప్లాంట్ బృందం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. గత ఏడాది స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొన్న సమస్యలను మార్కెటింగ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. సత్యానందం వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఏకే బాగ్చీ, ఎస్.సి పాండే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ కరుణ రాజు, స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు, సీనియర్ అధికారులు, సీ, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేషన్ నుంచి గంజాయి నిందితుల పరారీ

సీతమ్మధార: గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులు బేడీలతో ద్వారకా పోలీస్‌స్టేషన్ నుంచి సోమవారం తెల్లవారుజామున పరారయ్యారు. తమిళనాడు రాష్ట్రంలోని కుద్దాలూరు జిల్లా, కిజూహర్ మెయిన్‌రోడ్డుకు చెందిన వి.సురేష్ (22), త్రిమూర్తి (23) శనివారం రామాటాకీస్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించడంతో ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కు తీసుకొచ్చి గత రెండు రోజుల నుంచి విచారిస్తున్నారు. సోమవారం తెల్లవారు జామున విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిద్రలోకి జారుకోవడంతో వీరు బేడీలతోనే పరారయ్యారు. తరువాత చూసుకున్న సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో రెండు బృందాలుగా వారి కోసం గాలిస్తున్నారు. నెల రోజుల క్రితం ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులు బేడీలతో పరారైన సంఘటన మరువకముందే ద్వారకా పోలీస్‌స్టేషన్ నుంచి ఇప్పుడు మళ్లీ ఇద్దరు బేడీలతో పరారవడం సంచలనమైంది.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎంపీ జీవీఎల్

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం సీతమ్మధారలో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీజేపీపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, పార్టీ శ్రేణులు కలసికట్టుగా తిప్పికొట్టాలన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ బీజేపీ ఇటీవల ప్రవేశపెట్టిన ప్రజా చార్జిషీట్ ద్వారా వైఎస్సార్‌సీపీ నేతల అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ 28న జరిగే మన్‌కీ బాత్‌లో విశాఖ జిల్లా ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఆ రోజు మన్‌కీ బాత్‌లో విశాఖలో రెండు వేల మంది పాల్గొంటారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ ఈనెల 19న గన్నవరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం మేరకు జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రమోహన్, సోషల్ మీడియా కన్వీనర్ ఎ.కేశవకాంత్, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, సెయిల్ డైరెక్టర్ సాగి కాశీవిశ్వనాథరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాదవ్ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన

226 అర్జీలు స్వీకరించిన కలెక్టర్



ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ డా.మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : ప్రతి ప్రాంతంలో ఉన్న సమస్యలను 100 శాతం పరిష్కృతం చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 226 విజ్ఞప్తుల్ని స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి 120 అర్జీలు రాగా, జీవీఎంసీ 53, పోలీస్ శాఖకు సంబంధించి 16, ఇతర విభాగాలకు సంబంధించి 37 వినతుల్ని అర్జీదారులు అందించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' ద్వారా సమస్యల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి స్థాయి మరింత పెరిగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల్ని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ విభాగాధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 53 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 53 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధరం, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్జీలపై అలసత్వాన్ని సహించం

- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి
- జీవీఎంసీ స్పందనకు 78 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న నగర మేయర్ వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: స్పందనకు వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి ఆమె స్పందన కార్యక్రమం నిర్వహించారు. మొత్తంగా 78 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో జోన్-2 నుంచి పది, జోన్-3 నుంచి పది, జోన్-4 నుంచి పదకొండు, జోన్-5 నుంచి పన్నెండు, జోన్-6 నుంచి తొమ్మిది, జోన్-7 నుంచి రెండు, జోన్-8 నుంచి ఆరు ఫిర్యాదులు అందగా, ప్రధాన కార్యాలయానికి సంబంధించి పద్దెనిమిది ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్పందనకు వచ్చిన అర్జీల పరిష్కారంపై తన వద్ద రిపోర్ట్ ఉందని, ఆయా అర్జీదారునితో నేరుగా మాట్లాడడం జరుగుతుందన్నారు. అర్జీలు పరిష్కరించకుండా పరిష్కరించినట్లు చూపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీర్ రవికృష్ణరాజు, ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, సెక్రటరీ పి.నల్లనయ్య, ఏ అండ్ ఏఓ, డీసీపీలు, పర్యవేక్షక ఇంజనీర్, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖతో శరత్‌బాబుకు వీడని బంధం



స్నేహాంజలి ఆర్ట్స్ అకాదమి ఆధ్వర్యంలో శరత్‌బాబుకు సత్కారం (ఫైల్)

మద్దిలపాలెం: సినీనటుడు శరత్‌బాబుకు విశాఖతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన పలుమార్లు షూటింగ్ నిమిత్తం విశాఖ విచ్చేశారు. స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో 2008లో తారలు దిగివచ్చిన వేళ కార్యక్రమాన్ని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి విశాఖ విచ్చేసిన శరత్‌బాబుకు విమానాశ్రయం నుంచి కళాభారతి వరకూ ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు ఉత్తరాంధ్రతోపాటు, విశాఖతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విశాఖ సాగర తీరం వెంబడి ప్రయాణం గురించి ఎన్నో విషయాలు తెలిపారు. ఇక్కడి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన అందాలు ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. సాహిత్య, కళారంగాలకు ఉత్తరాంధ్ర పెట్టని కోటగా పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు, అభిమానులు సంతాపం తెలిపారు.

స్టేట్ యూత్ మెన్ బాక్సింగ్ చాంప్ విశాఖ

- రన్నరప్‌గా విజయనగరం
- బెస్ట్ బాక్సర్‌గా పవన్

విశాఖ స్పోర్ట్స్: 6వ యూత్ మెన్ అంతర జిల్లాల బాక్సింగ్ పోటీల్లో టీమ్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. విజయనగరం జట్టు 14 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. డీఆర్‌ఎం కప్ పేరిట రైల్వే బాక్సింగ్ హాల్‌లో 13 వెయిట్ కేటగిరిల్లో పోటీలు నిర్వహించారు. బెస్ట్ బాక్సర్‌గా బాంటమ్ వెయిట్‌లో వి.పవన్(అనంతపురం) నిలవగా... బెస్ట్ లూజర్‌గా బాంటమ్ వెయిట్‌లోనే బి.ప్రసాద్(విశాఖ) నిలిచాడు. ఈ చాంపియన్‌షిప్‌లో ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన యూత్ బాక్సర్లు పోటీ పడగా.. ఆయా కేటగిరిల్లో విజేతగా నిలిచిన బాక్సర్లను ఏపీ యూత్ మెన్ జట్టుగా ఎంపిక చేసి త్వరలో జరగనున్న అంతర్రాష్ట్ర మెన్ యూత్ చాంపియన్‌షిప్‌కు అర్హత కల్పించనున్నారు. ఫైనల్ లూజర్లు స్టాండ్‌బైగా నిలవనున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

విజేతలు వీరే...

- 45–48 కేజీల మినిమమ్ వెయిట్ కేటగిరిలో బి.వాసుదేవపాత్రుడు (విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఎస్.తేజేశ్వర్(విజయనగరం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. కె.కృష్ణ(శ్రీకాకుళం), డి.రామనిద్దిన్ (నెల్లూరు) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలందుకున్నారు.
- 48–51 కేజీల ఫ్లై వెయిట్ కేటగిరిలో కె.లోహిత్(విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా వి.మున్నా(చిత్తూరు) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు.
- 51–54 కేజీల బాంటమ్ వెయిట్ కేటగిరిలో వి.పవన్(అనంతపురం) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ద్వితీయ స్థానంలో బి.ప్రసాద్(విశాఖ) నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. చంద్రశేఖర్(విజయనగరం), అభిజ్ఞాన్ సుందర్(నెల్లూరు) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలందుకున్నారు.
- 54–57 కేజీల ఫెదర్ వెయిట్ కేటగిరిలో జె.బాలగణేష్‌రెడ్డి (విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా వి.మధు(శ్రీకాకుళం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. వై.హరీష్(అనంతపురం), కె.రవితేజ(విజయనగరం) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలందుకున్నారు.
- 57–60 కేజీల లైట్ వెయిట్ కేటగిరిలో పి.దిగ్విజయ్ (విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఎల్.వాసు(నెల్లూరు) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. కె.సిద్దిక్(ప్రకాశం), గగన్ శ్రీహర్ష(కడప) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలందుకున్నారు.
- 60–63.5 కేజీల లైట్ వెల్టర్ వెయిట్ కేటగిరిలో జె.భానుప్రకాష్ (విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా షేక్ మహ్మద్ ఆసిఫ్(ప్రకాశం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. నందగోపాల్(పశ్చిమగోదావరి), వేణుమాధవ్(శ్రీకాకుళం) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలందుకున్నారు.
- 63.5–67 కేజీల వెల్టర్ వెయిట్ కేటగిరిలో ఎస్.హర్షవర్ధన్ (విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఎన్.దిలీప్‌కుమార్ (నెల్లూరు) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. జెహథన్(పశ్చిమగోదావరి), హేమంత్(కర్నూలు) ఉమ్మడిగా కాంస్యాలందుకున్నారు.
- 67–71 కేజీల లైట్‌మిడిల్ వెయిట్ కేటగిరిలో వై.ప్రభాస్‌వర్ధన్(విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా బి.తృణ(శ్రీకాకుళం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. మనోజ్(విజయనగరం), జోగంధర్ ఉమ్మడిగా కాంస్యాలందుకున్నారు.
- 71–75 కేజీల మిడిల్ వెయిట్ కేటగిరిలో ఎ.అశోక్‌కుమార్(విశాఖ)విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఎస్.మోహన్‌రావు(విజయనగరం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. ధనుష్(నెల్లూరు), హరీష్(శ్రీకాకుళం) ఉమ్మడిగా కాంస్యాలందుకున్నారు.
- 75–80 కేజీల లైట్ వెయిట్ కేటగిరిలో కె.దుర్గాప్రసాద్(విజయనగరం)విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఆయుష్‌పూర్తి(చిత్తూరు) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. పూర్ణచంద్రశేఖర్(కర్నూలు), దిల్లేశ్వర్(శ్రీకాకుళం) ఉమ్మడిగా కాంస్యాలందుకున్నారు.
- 80–86 కేజీల క్రూయిజర్ వెయిట్ కేటగిరిలో పి.దేవ్‌కుమార్(విజయనగరం) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా కె.రాము(విశాఖ) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. సాయిసందీప్(నెల్లూరు), అభిషేక్(కర్నూలు) ఉమ్మడిగా కాంస్యాలందుకున్నారు.
- 86–92కేజీల హెవీ వెయిట్ కేటగిరిలో బి.చంద్రశేఖర్(విజయనగరం) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఆషిక్ గౌస్(ప్రకాశం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు.
- 92+కేజీల సూపర్ హెవీ వెయిట్ కేటగిరిలో శ్రీహర్ష భగవాన్(చిత్తూరు) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ప్రియదేవ్(విశాఖ) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు.



విజేతగా నిలిచిన విశాఖ జట్టు

జిరాఫీకి అస్వస్థత

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో జిరాఫీ అస్వస్థతకు గురైంది. ఇక్కడ ఉన్న జత జిరాఫీలలో నాలుగు రోజుల క్రితం ఆడ జిరాఫీ మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మగ జిరాఫీ ఒంటరిగా ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ రాత్రులు నైట్ షెల్టర్‌లో విశ్రాంతి తీసుకుంటోంది. ఒంటరిగా ఉన్న ఈ జిరాఫీ రెండు రోజులుగా అస్వస్థతకు గురైంది. దీంతో జూ అధికారులు స్పందించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ఒక జిరాఫీని కోల్పోయిన జూ అధికారులు మిగిలినదాన్ని కాపాడుకోవడానికి మరింత జాగ్రత్తలు తీసుకొంటున్నారు. జూ వైద్యుడు లాంగ్ లీవ్ పెట్టడంతో మరో వైద్యుడ్ని రప్పించి వైద్యసేవలందిస్తున్నట్టు జూ క్యురేటర్ నందనీ సలారియా చెప్పారు. ప్రత్యామ్నాయంగా వేరే వైద్యుడిని నియామకం కోసం ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టినట్లు తెలిపారు. వైద్యుడి సంరక్షణలో ప్రస్తుతం జిరాఫీ కోలుకుంటోందన్నారు.

అన్ని ఖాళీలను ప్రదర్శించాలి

ఎస్టీయు రాష్ట్ర కార్యదర్శి పైడిరాజు

విశాఖ విద్య: ఉపాధ్యాయ బదిలీల్లో ఏ ఒక్క ఉపాధ్యాయ పోస్టును బ్లాక్ చేయకుండా, అన్ని పోస్టులను అన్ని కేటగిరీల వారీగా ప్రదర్శించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇమంది పైడిరాజు కోరారు. ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం హర్షనీయమేనని, అయితే ఇటీవల విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాల చర్చల సందర్భంగా ప్రదర్శించిన విషయాలు, అంగీకరించిన విషయాలలో కొన్ని మార్పులు కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా కేటగిరీ వారీగా మొదటి, రెండు, మూడు కేటగిరిలో 10 శాతం వరకు బ్లాక్ చేస్తున్నట్టు మార్గదర్శకాల్లో ఉందన్నారు. దీనివల్ల ఆశించిన ఫలితాలు రావన్నారు. సింగల్ టీచర్ ఉపాధ్యాయులు బదిలీ అయిన సందర్భంలో నూతన టీచర్ పాఠశాలలో చేరేవరకు రిలీవ్ కాకూడదనే నిబంధన ఉందని, 100 శాతం ఖాళీలు ప్రదర్శిస్తే అందరికీ తగిన న్యాయం చేసినట్లు అవుతుందన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

పాఠశాల ఆర్‌జేడీ జ్యోతికుమారి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జ్యోతికుమారి

సింహాచలం : విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిదేద్ద బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పాఠశాల విద్య జోన్–1 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్త ఉపాధ్యాయుల ఇండక్షన్ శిక్షణ శిబిరం సోమవారం నుంచి ప్రారంభమైంది. శిబిరాన్ని ప్రారంభించిన జ్యోతికుమారి నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సమన్వయం చేస్తూ నాణ్యమైన బోధన అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గుర్తు చేశారు. శిక్షణ తరగతుల్లో విద్యాబోధనపై మెళకువలు నేర్చుకుని విద్యార్థులకు ఆవిధంగా బోధన చేయాలని సూచించారు. శిక్షణ కోర్సు కో ఆర్డినేటర్, జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా విద్యార్థుల ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. శిక్షణ వేదిక ఇన్‌చార్జి , డైట్ అధ్యాపకుడు జి.జి.ఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో అంశాల వారీగా రిసోర్స్ పర్సన్లు బోధిస్తారని, వాటిని పూర్తిగా అవగాహన చేసుకోవాలని సుచించారు. ఐదు రోజులపాటు జరిగే శిక్షణ తరగతుల్లో తెలుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం, గణితం, డిజిటల్ విద్య, జనరల్ సబ్జక్టులపై పూర్తి అవగావాన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి మూడు వందల మంది ఉపాధ్యాయు పాల్గొన్నారు. ఇరవై మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇవ్వనున్నారు.

చెన్నై నుంచి ఆర్డర్.. గుట్టుగా గంజాయి తరలింపు

- కావలిలో ఆరుగురి అరెస్ట్
- 50 కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): చెన్నైకి చెందిన కొందరు గంజాయి కావాలని ఆర్డర్ ఇచ్చారు. ఆరుగురు వ్యక్తులు సరకును గుట్టుగా రవాణా చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుల వివరాలను సోమవారం వెల్లడించారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కసర్లపూడి గ్రామానికి చెందిన జి.అనంత శివప్రసాద్, శరభవరం గ్రామానికి చెందిన కె.శ్రీను, రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన వి.రాజు, విశాఖపట్నం మద్దిలపాలేనికి చెందిన జి.రాజు, సీతమ్మధారకు చెందిన కె.ప్రేమ్‌కుమార్, మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన ఎ.రాజేష్ కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇంకా వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు ఒడిశా బోర్డర్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో గంజాయి సేకరించి చెన్నైకి చెందిన కార్తీక్, సురేష్‌కు కేజీ రూ.5 వేలు చొప్పున విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న నిందితులు రెండు కార్లలో 50 కేజీల గంజాయిని తీసుకుని చెన్నైకు బయలుదేరారు.

పక్కా సమాచారంతో దాడులు

గంజాయి అక్రమ రవాణాపై కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ ఎం.రాజేష్‌కు పక్కా సమాచారం అందింది. దీంతో 21న కావలి హైవేపై వాహన తనిఖీలు చేపట్టారు. ఓ హోటల్ సమీపంలో రెండు కార్లు ఆగాయి.

అందులోని ఆరుగురు వ్యక్తులు భోజనం చేసేందుకు వెళ్తుండగా పోలీసులు గమనించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. కార్లను తనిఖీ చేయగా అందులో 50 కేజీల గంజాయిని గుర్తించారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారించగా.. చెన్నైకు చెందిన గంజాయి విక్రేతలు కార్తీక్, సురేష్‌కు ఆర్డర్‌పై సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు ఆరుగుర్నీ అరెస్ట్ చేసి రెండు కార్లను, గంజాయిని సీజ్ చేశారు. ఈ సరకు విలువ రూ.10 లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

నిందితులపై పలు కేసులు

పట్టుబడిన నిందితుల్లో అనంత శివప్రసాద్‌పై కేడీపేట పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ యాక్ట్, రోలుగుంట, విశాఖపట్నం ద్వారకా స్టేషన్ పరిధిలో కేసులున్నాయి. కె.శ్రీనుపై రోలుగుంట స్టేషన్‌లో, ఎ.రాజేష్‌పై రోలుగుంట స్టేషన్, విశాఖపట్నం పీఎం పాలెం స్టేషన్‌లో గంజాయి కేసు ఉందని ఎస్పీ తెలిపారు.

జగనన్న ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తి చేయండి



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


డాబాగార్డెన్స్: జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జగనన్న లే అవుట్లపై హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు, జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్, జగనన్న ఇళ్ల స్పెషల్ ఆఫీసర్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో లబ్ధిదారులకు జియో టాగింగ్ పూర్తి చేయాలని, అలాగే రూ.35 వేలు రుణ ఏర్పాట్లు చేయాలని, అందుకు రుణాలు మంజూరుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జగనన్న కాలనీలో ఇప్పటి వరకు మొదలు పెట్టని ఇళ్లను వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు ఏ పే స్థాయిలో పనులు పూర్తవుతున్నాయో వాటిని సిస్టంలో ఏ రోజుకు ఆ రోజు అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వహణ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

‘నేను స్టూడెంట్ సర్’ అందరినీ అలరిస్తుంది

హీరో బెల్లంకొండ గణేష్

డాబాగార్డెన్స్: నేను స్టూడెంట్ సర్ చిత్రం అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఓ హోటల్‌లో సోమవారం చిత్ర హీరో బెల్లంకొండ గణేష్, నిర్మాత సతీష్ వర్మ, దర్శకుడు రాకేష్ ఉప్పలపాటి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ హాయిగా సాగిపోతున్న ఒక విద్యార్థి ప్రేమ కథలో ఎదురైన సమస్యను ఎలా అధిగమించాడన్నదే చిత్ర కథాంశమని పేర్కొన్నారు. తన పెదనాన్న ఉండేది విశాఖలోనేనని తెలిపారు. విశాఖ అంటే ఎంతో ఇష్టమన్నారు. విశాఖలో ఆదివారం ట్రైలర్ విడుదల చేశామని, మంచి స్పందన వచ్చిందని చెప్పారు. విశాఖ ప్రజలు సినిమాలు బాగా ఆదరిస్తారని, తన మొదటి సినిమా స్వాతిముత్యంను ప్రేక్షకులు ఆదరించారన్నారు. నిర్మాత సతీష్‌వర్మ మాట్లాడుతూ ఎస్‌వీ–2 ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నాంది సినిమా గతంలో తీసిన విషయాన్ని గుర్తు చేశారు. నేను స్టూడెంట్ సర్ చిత్రం జూన్ రెండో తేదీన విడుదలవుతుందని, మొదట ఈ సినిమా బెల్లంకొండ శ్రీనివాస్‌తో చేయలనుకున్నా..అతని తండ్రి సురేష్ సూచనతో గణేష్‌తో చేశామన్నారు. ఈ సినిమాలో విలన్ ఎవరన్నది చివరి వరకు తెలియదన్నారు. ప్రేక్షకులు విలన్ ఎవరో ముందుగా ఊహించి తమకు చెబితే బహుమతులు ఇస్తామని ప్రకటించారు. దర్శకుడు రాకేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ తాను దర్శకుడు తేజ వద్ద సహాయ దర్శకుడిగా పని చేశానని తెలిపారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నానని చెప్పారు. హిందీ హీరోయిన్ భాగ్యశ్రీ కుమార్తె అవంతిక దాసిని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నామని చెప్పారు. మీడియా సమావేశంలో చిత్ర నటులు రియా, స్వామి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాసరావు మృతదేహం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్ సీనియర్ ఫోర్‌మెన్ ఇంగువ శ్రీనివాసరావు (48) ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. కొయ్యూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు తన కుటుంబంతో టౌన్‌షిప్‌లోని సెక్టార్–6కు చెందిన 343 ఎఫ్ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన శ్రీనివాసరావు విధులకు కూడా సరిగా వెళ్లడం లేదు. ఇంట్లో మద్యం తాగుతూ గడుపుతున్నాడు. ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం తన రూంలోకి వెళ్లిన శ్రీనివాసరావు ఎంతసేపటికీ రాకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా కిటికీకి ఉరి వేసుకుని కనిపించారు. స్టీల్ ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించగా సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్లోకి కేటీఎం అడ్వెంచర్ 390 ఎక్స్



బైక్‌ను ఆవిష్కరిస్తున్న వరుణ్ బజాజ్ సీఈఓ శ్రీనివాస్

సీతమ్మధార : అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న సరికొత్త కేటీఎం అడ్వెంచర్ 390 ఎక్స్ బైక్‌ను దొండపర్తిలోని కేటీఎం షోరూంలో వరుణ్‌బజాజ్ సీఈఓ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఎం బైక్‌లు అత్యుత్తమ సామర్థ్యంతో ఆకర్షణీమైన ఎడ్జీ డిజైన్‌తో థ్రిల్లింగ్ రైడ్ అనుభూతిని అందిస్తున్నాయన్నారు. ఈ 390 ఎక్స్‌లో స్ప్లిట్ ట్రెల్లిస్ ఫ్రేమ్, ఆఫ్‌రోడ్డు మోడ్‌తో డ్యూయల్ చానల్ ఏబీఎస్, 320 మి.మీ ఫ్రంట్, 230మి.మీ, వెనుక డిస్క్ బ్రేక్‌లు, గ్రౌండ్ క్లియరెన్స్ ఎల్‌సీడీ డిస్‌ప్లేతో పాటు మరిన్ని ఫీచర్స్ ఉన్నాయన్నారు. బైక్ రూ.2,80,848 ఎక్స్ షోరూం ధర అన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.